
# పాపము మరియు అన్ని రకాల చెడు ఈ లోకంలోకి ప్రవేశించిన విధానం

**ప్రార్థన :** ప్రియమైన ప్రభువా, ఆదాము చేసిన పాపం అతన్ని వేరుచేసినట్టుగా తమ పాపం కూడ నీ నుండి వారిని వేరు చేస్తుందనీ పిల్లలను హెచ్చరించడానికీ మరియు నీతో నిరంతరం జీవించాలంటే నీ నుండి పాపక్షమాపణను పొందాలని వారు గ్రహించడానికీ ఈ అధ్యయనం తోడ్పడేలా చేయి.



ఆదికాండం 3వ అధ్యాయం నుండి ఆదాము హవ్వల అవిధేయతను గూర్చిన కథను ఒక విద్యార్థి లేదా టీచర్ చెప్పాలి. లేదా చదివి వినిపించాలి. సాతాను సర్పం రూపంలో వచ్చి ఆదాము హవ్వలు దేవునికి అవిధేయులయ్యేలా ఎలా శోధించాడో ఈ కథ తెలియజేస్తుంది. దేవుడు పరిశుద్ధుడు గనుక వారిని తన సన్నిధి నుండి గెంటివేసి వారు మరణించేలా వదిలి వేశాడు.



కథ చెప్పిన తర్వాత క్రింది ప్రశ్నలడగండి. *(ప్రతి ప్రశ్న తర్వాత జవాబు ఇవ్వబడింది).*

- తాను ఆ పండు తినకూడదని దేవుడు కోరుతున్నాడని హవ్వకు ఎలా తెలుసు? *(3వ వచనం)*
- హవ్వకు ఆ పండు తినాలని అనిపించేలా చేయడానికి సాతాను ఎటువంటి అబద్ధాలు చెప్పాడు? *(4–5 వచనాలు)*
- ఆదాము ఆ పండు ఎందుకు తిన్నాడు? *(6వ వచనం)*
- ఆదాము హవ్వలు తమ అవిధేయత యొక్క నేరం ఎవరి మీద మోపారు? *(12–13 వచనాలు)*
- స్త్రీ సంతానం సాతానును ఏం చేస్తుందని దేవుడు చెప్పాడు? *(15వ వచనం)*
- దేవుడు స్త్రీకి ఏమి శిక్ష విధించాడు? *(16వ వచనం)*
- ఆదాముకు ఏ శిక్ష విధిస్తున్నానని దేవుడు చెప్పాడు? *(17వ వచనం)*
- వారు దేవుని సన్నిధిని విడిచిపెట్టి తోటలో నుండి ఎందుకు వెళ్ళిపోవల్సి వచ్చింది? *(22–24 వచనాలు)*

ఆదికాండం 3వ అధ్యాయం నుండి మానవాళి యొక్క తొలి పాపం గూర్చిన కథను నాటికగా ప్రదర్శించండి.

- ఆరాధనను నడిపించే ముఖ్యనాయకున్ని సంప్రదించి, పిల్లలు పెద్దల ముందు నాటికను ప్రదర్శించడానికి ఏర్పాట్లు చేయండి. కథలోని అన్ని భాగాలు ప్రదర్శించనవసరంలేదు.
- పిల్లలు నాటికను సిద్ధం చేస్తుండగా వారితో పాటు కొంత సమయం గడపండి.
- పెద్ద పిల్లలు చిన్న పిల్లలకు సహాయపడేలా చూడండి.
- **పెద్ద పిల్లలు** లేదా పెద్దవారు క్రింది పాత్రలు ధరించాలి : **కథకుడు, ఆదాము, హవ్వ, దేవుని స్వరం, సర్పం**
- **చిన్న పిల్లలు** క్రింది పాత్రలు ధరించాలి : **జంతువులు, దేవదూత (ఖడ్గం పట్టుకోవాలి)**

**కథకుడు :** ఆదికాండం 3:1–6 నుండి కథలోని మొదటి భాగం చెప్పాలి తర్వాత “ఆదాము జంతువులన్నింటికీ పేర్లు పెట్టాడు చూడండి జంతువులన్ని ఎలా నడుస్తున్నాయో” అనాలి.

**జంతువులు :** చిన్న పిల్లలు వివిధ జంతువుల శబ్ధాలుచేస్తూ నడుస్తూ వెళ్ళాలి.

**ఆదాము :** ఏదైనా ఒక జంతువును చూపిస్తూ “నేను దీనికి ఏం పేరు పెట్టాలి?” అని ఎవరినైనా అడగాలి. ఆ వ్యక్తి పేరును సూచించాలి.

**కథకుడు :** సాతాను పాము శరీరం ధరించాడు. అదేమంటున్నదో వినండి అనాలి.

**సర్పం :** పెద్దగా బుసకొడుతూ ఒక పండును హవ్వకు చూపిస్తూ “దేవుడు ఈ తోటలో ఏపండునైనా తినొద్దని మీకు చెప్పాడా?”

**హవ్వ :** “అబ్బా ఎంత అందమైన పాము! అంటూ పండు వైపు చూసి “లేదు! లేదు! తోట మధ్యలో ఉన్న చెట్టు పండును తప్ప ఏ పండునైనా మేం తినవచ్చని దేవుడు చెప్పాడు. అది తింటే మేం మరణిస్తాం”

**సర్పం :** “పెద్దగా బుసకొడుతూ లేదు హవ్వా మీరు చనిపోరు. మీరు తెలివిగల వారవుతారు. దేవునివలె మారిపోతారు పాపమంటే ఏమిటో మీకు తెలుస్తుంది” అంటూ వికటంగా నవ్వాలి.

**హవ్వ :** పండు ఎంతో ఇంపుగా కనిపిస్తుంది దాని రుచికూడా బాగుండవచ్చు. అది రుచిచూడాలని కుతూహలంగా ఉంది. పాపం అంటే ఏమిటో కూడా తెలుసుకోవచ్చు. దేవుడు చెప్పిన మాట నేను వినాల్సిన అవసరంలేదు. నాకేమి తినాలనిపిస్తే అవి తింటాను. అది కొంచెం తిని మిగిలింది ఆదాము కిచ్చి” ఆదాం! ఈ పండు నీవు కూడా తిను” అనాలి.

**ఆదాము :** హవ్వా! ఈ పండును దేవుడు తినొద్దని చెప్పాడు. అయినా నీవు తినమంటే తింటాను. పాపమంటే ఏమిటో నాకు కూడా తెలుసుకోవాలని ఉంది.

**సర్పం :** నవ్వుతూ “మీరు దేవునికి అవిధేయులు కావాలని ఎంచుకొన్నారు. ఇప్పుడాయన తన నుండి మిమ్మల్ని శాశ్వతంగా దూరం పంపించేస్తాడు” అని వికటంగా నవ్వుతూ బుసకొట్టాలి.

**కథకుడు :** ఆదికాండం 3:7–13 నుండి కథలోని రెండవ భాగం చెప్పాలి. తర్వాత ఆదాము ఏమంటున్నాడో వినండి అనాలి.

**ఆదాము :** హవ్వా మనమెంత పని చేశాం? దేవునికి అవిధేయులమయ్యాం! ఇప్పుడు మనం నగ్నంగా ఉన్నామనిపిస్తుంది.

**హవ్వ :** ఇదిగో ఇక్కడ పెద్దపెద్ద అంజూరపు ఆకులున్నాయి వీటితో మనకు బట్టలుకుడతాను.

**దేవుని స్వరం :** ఆదామా! ఆదామా! ఎక్కడున్నావ్? (గట్టిగా పిలివాలి) మీరు ఆనందంగా జీవించడానికి మీ కొరకు నేను సృష్టించిన తోటలో మీతోపాటు కాసేపు నడవడానికి మీతో కొంత సమయం గడపడానికి నేను వచ్చాను.

**ఆదాము :** నేను నగ్నంగా ఉన్నాను గనుక నీ ముందుకు రావడానికి భయపడ్డాను అందుకే దాక్కున్నాను.

**దేవుని స్వరం :** నీవు నగ్నంగా ఉన్నావని నీకెవరు చెప్పారు? నేను తినకూడదని చెప్పిన పండు తిన్నావా?

**ఆదాము :** హవ్వ అది నాకిచ్చింది.

**హవ్వ :** సర్పం నాతో అబద్ధమాడింది. ఆ పండు మాకు మంచి చేస్తుందని చెప్పింది.

**కథకుడు :** ఆదికాండం 3:14–24 నుండి కథలోని మూడవ భాగం చెప్పి “దేవుడు ఆదాము హవ్వల కొరకు జంతువుల చర్మంతో అంగీలు కుట్టించాడు. ఆయనే మంటున్నాడో” వినండి.

**దేవుని స్వరం :** సర్పమా నీవు నేలమీద పాకుతావు. హవ్వ సంతానం నుండి ఒకరు నిన్ను నాశనం చేస్తారు. హవ్వా నీవు నాకు అవిధేయురాలవయ్యావు గనుక ప్రసవవేదనతో పిల్లలను కంటావు. ఆదామా నీవు కష్టపడి, నేలను సేద్యంచేసి పంటలు పండిస్తావు. మీరిక నాతోపాటు ఈ తోటలో ఉండడానికి వీల్లేదు.”

**దేవదూత :** ఖడ్గాన్ని ఆదాము వైపు చూపిస్తూ “నీవు దేవునికి లోబడలేదు. నీ అవిధేయతను బట్టి నీవు శాశ్వతంగా దేవుని సన్నిధిలో ఉండే అవకాశం కోల్పోయావు.

**కథకుడు :** నాటిక ప్రదర్శించడంలో సహాయపడినవారందరికి కృతజ్ఞతలు చెప్పాలి. శ్రద్ధగా చూసినందుకు పెద్దలకు వందనాలు చెప్పాలి.

**ప్రశ్నలు :** ఒకవేళ పిల్లలు ఈ నాటికను పెద్దల కొరకు ప్రదర్శించినట్టయితే పాఠం మొదటి భాగంలో ఇవ్వబడిన ప్రశ్నలను కూడ వారు పెద్ద వారిని అడగవచ్చు.

**అభ్యాసము :** ఒక చిన్న బిడ్డ వీపుమీద ఒక పెద్ద మూటను లేదా సంచీని తాడుతో కట్టుకొని (దానిలో తేలికైన వస్తువులు ఉండేలా చూడండి) అందరికి దగ్గరికి వెళ్ళి “నేను ఈ పాపభారాన్ని ఏ విదంగా వదిలించు కోగలను?” అని

అడగాలి. వారు జవాబివ్వాలి. మరొక బిడ్డ ఒక కత్తిని చూపిస్తూ ఇది దేవుని వాక్యం అనే ఖడ్గం, యేసు రక్తం మన పాపాలను కడిగి వేస్తుందని ఇది చెప్తుంది. దానితో మూటను కట్టిన తాడును కోసి, లేదా ముడి విప్పి, మూట క్రిందిపడిపోయేలా చేయాలి.



పిల్లలు ఒక పాము పటాన్ని గానీ లేదా పండు పటాన్నిగానీ గీయాలి ఆ పటాలను ఆరాధన సమయంలో పెద్దలకు చూపించి, సాతాను మనలను ఎలా శోధిస్తాడో అవి తెలియజేస్తున్నాయని చెప్పాలి.

చిన్న పిల్లలు **రోమా 3:23** మరియు పెద్ద పిల్లలు **రోమా 5:12** కంఠస్థం చేయాలి.

**చర్చ** : ఈ రోజుల్లో మనుషులు ఏ విధంగా దేవునికి అవిధేయత చూపే మార్గాలను ఎన్నుకొంటున్నారు? అని పిల్లలను అడగండి. వారిచ్చే జవాబులను బట్టి చర్చించండి.

**కవిత :** కీర్తన 53:1–3 వచనాలను ముగ్గురు పిల్లలు ఒక్కొక్కరు ఒక వచనం చొప్పున కంఠతా చెప్పాలి.

**ప్రార్థన :** "ప్రియమైన ప్రభువా, మేము ఎన్నోసార్లు నీకు అవిధేయులమయ్యాము. సాతానుకు బానిసలమయ్యాము. మా శత్రువైన సాతాను తలను చితుకగొట్టి మమ్మల్ని విడుదల చేయడానికి హవ్వ సంతానమైన యేసును పంపించినందుకు వందనాలు.

Copyright © 2004 by Paul-Timothy. May be freely copied. Download from www.Paul-Timothy.net